సాక్షి
శ్రీకాకుళం
సోమవారం, 5, ఆగస్టు, 2024



మంచం పట్టిన..

మెట్టవలస మంచం పట్టింది. 30 మంది డయేరియాతో బాధ పడుతున్నారు.

- 8లో



సీఐలకు స్థానచలనం

సీఐలను బదిలీ చేశారు. జిల్లాలో ఏడుగురిని వీఆర్‌కు పంపించారు.

- 8లో

ఆదిత్యుని ఆలయంలో ప్రత్యేక పూజలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా స్వామి మూలవిరాట్టును అలంకరించి సర్వదర్శనాలకు ఆదివారం ఉదయం 6 గంటల నుంచే అనుమతించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామికి ప్రత్యేకంగా మొక్కులు చెల్లించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వాల నిర్లక్ష్యమే ఉత్తరాంధ్రకు శాపం



ఉత్తరాంధ్రపై మాట్లాడుతున్న వక్తలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రభుత్వాల నిర్లక్ష్యమే ఉత్తరాంధ్రకు శాపమైందని ప్రజా, వామపక్ష సంఘాల ప్రతినిధులు అన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుపై 'ఉత్తరాంధ్ర ఆకాంక్షలు–కార్యాచరణ' పేరుతో ఉపాధ్యాయులు పేడాడ కృష్ణారావు, మిస్క కృష్ణయ్య, సీనియర్ విలేకరి, న్యాయవాది చౌదరి లక్ష్మణరావుల ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వీవీ రమణమూర్తి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు మాట్లాడుతూ అన్ని రంగాల్లో ఉత్తరాంధ్రను నిర్లక్ష్యం చేసిన పాపం పాలకులదేనని అన్నారు. విశాఖ ఉక్కు, రైల్వే జోన్ల విషయంలో ఈ విషయం తేటతెల్లమైందన్నారు. ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులకు నిధులు లేక కునారిల్లుతున్నాయని తెలిపారు. ప్రమాదకరమైన పరిశ్రమలకు ఉత్తరాంధ్ర కేంద్రంగా మారిందని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ జగన్నాథరావు అన్నారు. ఈ పరిస్థితి పోరాటంతోనే మారుతుందన్నారు. అన్ని సంఘాలు కలిసి పోరాడి ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చాలని ఉత్తరాంధ్ర పోరాట సమితి కన్వీనర్ సన్నశెట్టి రాజశేఖర్ అన్నారు. ఉత్తరాంధ్ర పరిస్థితిపై ప్రజా కళా మండలి, అరసం సభ్యులు కవితలు, పాటల రూపంలో వివరించారు. వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, నీలకంఠం, పి.దానేషు, కె.రాంగోపాల్, బొడ్డేపల్లి మోహన్‌రావు, ఎస్ వీరాస్వామి, ఆర్.చిరంజీవి, బీన ఢిల్లీరావు, ఆర్.లోకనాథం, రామకృష్ణ తదితరులు మాట్లాడారు.

చిన్నారి వైద్యానికి సాయం



క్యాన్సర్ బాధిత చిన్నారి కుటుంబానికి సాయం అందిస్తున్న జాడుపూడి గ్రామస్తులు

కంచిలి: మండలంలోని కర్తలి గ్రామానికి చెందిన పైల తాతయ్య, ధనలక్ష్మి కుమారుడు పైల రిషికేశ కేన్సర్ చికిత్స కోసం దాతలు ముందుకువస్తున్నారు. 'సాక్షి'లో వచ్చిన కథనానికి దాతలు స్పందిస్తున్నారు. శ్రీ కాళీ దుర్గామాత సేవాసంస్థ తరఫున గ్రామస్తులు, చిన్నారి తల్లి ధనలక్ష్మి బంధువులు కలిసి రూ.3,10,000 విరాళాలు పోగుచేసి, ఈ మొత్తాన్ని బాధిత చిన్నారి కుటుంబానికి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిలక చిన్నబాబు, పలికల జయరాం, జాడుపూడి, కర్తలి గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు, గంగాధరపురం యువత, గ్రామస్తులు రూ.57 వేల ఆర్థిక సాయాన్ని ఆ కుటుంబానికి ఆదివారం అందజేశారు. గంగాధర పురం గ్రామంలో మొగిలి అప్పలస్వామి కుమార్తె మొగిలి లక్ష్మి అనారోగ్యంతో విశాఖపట్నంలో చికిత్స పొందుతోంది. వైద్యఖర్చుల నిమిత్తం హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు రూ.పదివేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు.


'శాస్త్రీయ దృక్పథం పెరగాలి'



మాట్లాడుతున్న ఫోరం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్

నరసన్నపేట: జీవ శాస్త్ర పాఠ్య పుస్తకాలు మరింత విస్తృత సమాచారంతో రూపొందించాలని, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని ఏపీ జీవ శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం జిల్లా అధ్యక్షుడు పుట్టా ఉదయకుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏపీ జీవశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉదయకుమార్ మాట్లాడుతూ జీవ శాస్త్ర ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారులను కోరారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి గోవిందరావు మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో జీవ శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం అభివృద్ధి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు నూతన టెక్నాలజీని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, ఉపాధ్యాయ ఫోరం ప్రతినిధులు త్రివిక్రమరావు, లోకేశ్వరరావు, నరసన్నపేట నియోజకవర్గ పరిధిలోని జీవ శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లబల్ల తెల్లబోయేలా..



- ప్రభుత్వ పాఠశాలలపై నిర్లక్ష్యపు నీడలు
- రుచి మారిన మధ్యాహ్న భోజనం
- అమలు కాని 'తల్లికి వందనం'
- టోఫెల్ క్లాసులకు మంగళం
- విద్యా కానుక కిట్ల పంపిణీలో జాప్యం
- వైఎస్ జగన్ హయాంలో ప్రభుత్వ బడులకు అగ్రపీఠం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : ప్రభుత్వ పాఠశాలలు తెరుచుకుని యాభై రోజులకు పైగా గడిచిపోయాయి. బడుల్లో అన్ని రకాల పనులు, పర్యవేక్షణల గురించి అంచనాకు వచ్చేందుకు కొత్త ప్రభుత్వానికి ఈ మాత్రం సమయం సరిపోతుంది. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం ప్రభుత్వ బడులపై పెద్దగా శ్రద్ధ పెడుతున్నట్టు కనిపించడం లేదు. గత ప్రభుత్వమే సిద్ధం చేసి ఉంచిన విద్యా కానుక కిట్ల పంపిణీ దగ్గర నుంచి మధ్యాహ్న భోజనం నాణ్యత వరకు, మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లుల చెల్లింపు దగ్గర నుంచి తల్లికి వందనం పథకం అమలు వరకు, టోఫెల్ క్లాసుల నిర్వహణ దగ్గర నుంచి ఉపాధ్యాయుల సర్దుబాటు వరకు సర్కారు నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

స్టూడెంట్ కిట్లకు రాజకీయ రంగు..



బడి తెరిచిన తొలిరోజే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారాలు, బూట్లు, బ్యాగులు ఇచ్చేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే 1,73,723కిట్లను సిద్ధం చేసి ఉంచింది. కానీ టీడీపీ కూటమి ప్రభుత్వం వాటిని తొలిరోజు పిల్లలకు ఇచ్చేందుకు సుముఖత చూపలేదు. నాయకులు తీరిక చేసి వచ్చేంత వరకు పిల్లలకు పుస్తకాలు ఇవ్వకూడదని స్కూళ్లకు తేల్చి చెప్పేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు రెండు నెలలు కావస్తున్నా వంద శాతం పంపిణీ జరిగిన దాఖలాల్లేవు. ఇప్పటికీ కొంతమందికి షూలు, పాఠ్యపుస్తకాలు అందని పరిస్థితులు ఉన్నాయి.

మధ్యాహ్న భోజన కార్మికులపై చిన్న చూపు



స్కూళ్లలో మధ్యాహ్న భోజనం తయారు చేసే కార్మికులకు, ఏజెన్సీలకు సకాలంలో చెల్లింపులు చేయడం లేదు. జూన్‌కు సంబంధించి ఆగస్టులో బిల్లులు వచ్చాయంటే నిర్లక్ష్యాన్ని అర్థం చేసుకోవచ్చు. జూలై బిల్లులు ఇంకా రాలేదు. దీంతోపాటు మధ్యాహ్న భోజన నాణ్యత రుచి కూడా తగ్గుతున్నట్లు విద్యార్థుల నుంచి ఫీడ్‌బ్యాక్ వస్తోంది.

టీచర్ల సర్దుబాటుకు అడ్డంకులు..



జిల్లాలో 2649 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 12,178 ఉపాధ్యాయ శాంక్షన్ పోస్టులు ఉన్నాయి. వీటిల్లో 11,210 మంది పని చేస్తున్నారు. 749 ఖాళీలు ఉండగా.. ఈ రెండు నెలల్లో పదవీ విరమణ చేసిన వారితో కలుపుకొని మొత్తం 968 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నాయి. వీటిని భర్తీ చేసేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం డీఎస్సీ ప్రకటించింది. ఎన్నికల కోడ్‌ను బూచిగా చూపించి కోర్టు ద్వారా కూటమి నాయకులు అడ్డుకున్నారు. అధికారంలోకి వచ్చాక మెగా డీఎస్సీ అని చెప్పి ఇప్పటికే పక్కన పెట్టేశారు. ఎన్నికల ముందు జరిగిన 46 బదిలీలను ఆపేశారు. 650 మంది ఉపాధ్యాయులను చేయాల్సిన సర్దుబాటును ఆపేశారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో 2018 డీఎస్సీలో అర్హత సాధించిన 620 మందికి, 1998 డీఎస్సీకి చెందిన 353 మందికి, 2008 డీఎస్సీలో అర్హత సాధించిన 112మందికి ఉపాధ్యాయులుగా పోస్టింగ్ ఇచ్చారు. సబ్జెక్ట్ టీచర్లను ఏర్పాటు చేశారు.

మెయింటెనెన్స్ ఎక్కడ..?



వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఏటా ప్రభుత్వ పాఠశాలలకు నిర్వహణ వ్యయం కింద విద్యార్థుల సంఖ్య మేరకు రూ.15వేల నుంచి రూ.లక్షా 50వేల వరకు నిర్వహణ వ్యయం కింద ఇచ్చేవారు. విద్యుత్ బిల్లులు, సుద్ద ముక్కలు, వైట్ పేపర్లు ఇతరత్రా వాటికి కొనుగోలు చేసుకునే వెసులుబాటు కల్పించారు. అంతే కాకుండా టాయిలెట్ నిర్వహణకు అవసరమైన బకెట్లు, క్లీనర్స్ తదితర మెటీరియల్‌ను అందజేసేవారు. ఈ ఏడాది ఎన్నికలు ఉండడంతో ఫిబ్రవరిలో ప్రతి పాఠశాలకు రూ. 10వేల నుంచి రూ. 50వేలు అందజేశారు. రన్నింగ్ వాటర్, ర్యాంపు, విద్యుత్ రిపేర్లు తదితర వాటికి ఖర్చు చేయాలని సూచించడంతో పాటు మళ్లీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వమే విద్యుత్ బిల్లులను నేరుగా చెల్లిస్తుందని, ఎప్పటిలాగానే మెయింటెనెన్స్ గ్రాంటు ఇస్తారని చెప్పారు. కానీ కొత్త ప్రభుత్వం వీటి ఊసెత్తడం లేదు.

'తల్లికి వందనం' అమలెప్పుడో..?

గతంలో అమలైన అమ్మ ఒడి పథకం స్థానంలో తల్లికి వందనం పథకం కింద ఇంటిలో ఎంత మంది పిల్లలు చదివితే అంతమందికి సంవత్సరానికి రూ. 15వేలు చొప్పున అందిస్తామన్నారు. కానీ యాభై రోజులు దాటాక కూడా దీనిపై కనీస కసరత్తు చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు 3, 23,19 మంది ఉన్నారు. వారందరికీ రూ. 15వేలు చొప్పున రూ. 484కోట్ల మేరకు అందించాలి.



నరసన్నపేట టౌన్‌లో విద్యార్థులు లేక మూతపడిన పాఠశాల

టోఫెల్, బైజూస్‌కు మంగళం



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లిష్ భాషా ప్రావీణ్యం పెంపొందించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం టోఫెల్ క్లాసులు ప్రవేశపెట్టింది. కానీ ప్రస్తుతం ఆ క్లాసులు ఆగిపోయాయి. బైజూస్ కంటెంట్ కూడా ఆగిపోయినట్లు సమాచారం. వన్ వర్డ్- వన్ డే అని విద్యార్థులకు రోజుకొక పదం నేర్పేవారు. ఇప్పుడు దాన్ని గాలికొదిలేశారు.



వైఎస్ జగన్ హయాంలో వినూత్న మార్పులు



- వైఎస్ జగన్ హయాంలో ప్రత్యేకించి ప్రభుత్వ పాఠశాలలపై దృష్టి పెట్టారు.
- పేదింటిలో చదువులకు ఇబ్బంది ఉండకూడదని తొలిసారిగా 'అమ్మ ఒడి' అనే పథకాన్ని ప్రవేశపెట్టి దిగ్విజయంగా అమలు చేశారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు.
- సామాన్యుల పిల్లలు ఇంగ్లిష్‌లో చదవాలని టోఫెల్ క్లాసులతో పాటు కొత్త కొత్త పద్ధతులు ప్రవేశపెట్టారు.
- వీధి బడి పిల్లలు ఎందులోనూ తక్కువ కాకూడదని బూట్లు, సాక్సులు,బ్యాగులు, యూనిఫారాలను బడి తెరిచిన తొలిరోజే అందించారు.
- తరగతి గదుల్లో అధునాతన సదుపాయాలు కల్పించారు.
- నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు కొత్త ఊపిరి పోశారు.
- పిల్లలకు కొత్త మెనూ అమలు చేయడంతో పాటు బెల్లం కలిపిన రాగిమాల్ట్‌ను అందజేశారు.
- కరిక్యులంలో మార్పులు చేయడంతోపాటు తెలుగు, ఇంగ్లిష్ కలగలుపులో పుస్తకాలు ముద్రించి ఇచ్చారు.

వేదన జీవులు



- చిరుద్యోగులపై కక్ష కడుతున్న కూటమి ప్రభుత్వం
- రాజకీయ స్వలాభం కోసం తొలగింపులు
- రేషన్ డీలర్లు, మధ్యాహ్న భోజనం కార్మికులు, దేవాలయాల ఉద్యోగుల తొలగింపు
- మరికొన్ని శాఖల్లోనూ తీసేయాలని మౌఖిక ఆదేశాలు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : కేవలం వేతనంపై ఆధారపడి బతికే బతుకులు వారివి. ఒక్క నెల జీతం ఆగినా దిక్కుతోచని స్థితిలో పడిపోయే జీవితాలు వారివి. అలాంటి నిస్సహాయులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోంది. అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి.. ఇప్పుడు ఉన్న ఉద్యోగాలను పీకేస్తున్నారు. గత ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆప్కాస్ అనే కార్పొరేషన్ ఏర్పాటు చేసి మధ్యవర్తులు లేకుండా ఉద్యోగ ధీమా కల్పించగా ఇప్పుడీ ప్రభుత్వం వచ్చి అర్ధంతరంగా తీసేసి ఉపాధి లేకుండా చేస్తోంది. తమ అనుయాయులను వేసుకునేందుకు పథకం ప్రకారం వేటు వేస్తోంది. ఒక్క ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్న వారినే కాదు ప్రైవేటు కంపెనీల్లో పనిచేస్తే కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని తీసేయాలని సంబంధిత యాజమాన్యాలపై ఒత్తిడి చేసి తీసేస్తున్నారు.

తొలగింపు కుట్రలు అమలు

- అరసవిల్లి సూర్యనారాయణస్వామి దేవాలయంలో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న 48 మంది దినసరి ఉద్యోగులపై వేటు వేస్తున్నట్టు తాజాగా ఆదేశాలు జారీ చేశారు. సాక్షాత్తు స్థానిక ఎమ్మెల్యే నుంచి ఒత్తిడి రావడంతో అధికారులు సైతం ఏం చేయలేని పరిస్థితి నెలకుంది.
- కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో 63 మంది మధ్యాహ్న భోజనం కార్మికులను తొలగించారు. మరో వందమందిని తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.
- వలంటీర్ వ్యవస్థను ఆపేయడంతో జిల్లాలో ఇప్పటికే 15,328 మంది రోడ్డున పడ్డారు. తాము అధికారంలోకి వస్తే రూ. 10వేలు జీతం ఇస్తామని చెప్పిన చంద్రబాబు అండ్‌కో ఇప్పుడీ వ్యవస్థనే ప్రశ్నార్థకం చేసింది.
- రేషన్ డీలర్లపైనా కన్నేశారు. ఇప్పుడున్న డీలర్లను తొలగించి వారి స్థానంలో తమ వాళ్లను వేసుకోవడానికి జాబితాలు తయారు చేశారు. ఇప్పటికే 8 మందిని తొలగించారు.
- ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లపైనైతే కూటమి నాయకులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ముఖ్యంగా టెక్కలి, ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం, నరసన్నపేట, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. ఏదో ఒక నెపం పెట్టి వేటు వేయాలని చూస్తున్నారు.
- ప్రైవేటు కంపెనీలనూ వదలడం లేదు. స్థానికంగా కంపెనీలు నడపాలంటే తమకు కప్పం కట్టడంతో పాటు తాము చెప్పినవారినే కార్మికులుగా పెట్టుకోవాలని హుకుం జారీ చేస్తున్నారు. రణస్థలంలోని యూబీ బీర్ల కంపెనీలో ఏం జరిగిందో అందరూ చూశారు. కూటమికి అనుకూలంగా లేని కార్మికులను తొలగించారు. మూలపేట పోర్టులోనూ అదే జరిగింది. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులని స్థానికులను ఉద్యోగాల నుంచి తొలగించే ప్రయత్నం చేశా రు. గ్రామస్తులంతా పోర్టు వద్ద పెద్ద ఎత్తున నిరసన చేయడమే కాకుండా కార్యకలాపాలకు అడ్డు తగలడంతో తాత్కాలికంగా వెనక్కి తగ్గారు.

పథకం ప్రకారమే..

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, సీఎఫ్‌లు, వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులు, యూనివర్సిటీలో కొనసాగుతున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ట్రిపుల్ ఐటీలో కొనసాగుతున్న చిరు ఉద్యోగులు, విద్యుత్ శాఖలోని షిఫ్ట్ ఆపరేటర్లు, ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులు.. అవకాశం ఉన్న చోటల్లా ప్రభుత్వం వేటు కత్తిని వాడుతోంది. గిట్టనివారిపై వారే ఫిర్యాదు చేయడం, విచారణకు వచ్చిన అధికారుల ముందే వారే హాజరవ్వడం, తామిచ్చే స్టేట్‌మెంట్ రికార్డు చేసుకుని తప్పించాలని కీలక నేతల నుంచి ఒత్తిడి చేయించడం వంటి కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. కొన్నిట్లయితే ఏకంగా బెదిరింపులకు దిగుతున్నారు. 2014–19లో ఏ రకంగానైతే డ్వామా, డీఆర్‌డీఏ, హౌసింగ్, వ్యవసాయ శాఖలో పనిచేసిన అవుట్ సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగులను తొలగించారో అదే రకంగా మళ్లీ వ్యవహరిస్తున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎక్కడా చిరు ఉద్యోగులను తొలగించే ప్రయత్నం చేయలేదు. ఆప్కాస్ అనే కార్పొరేషన్ పెట్టి వారికి భద్రత కల్పించడమే కాకుండా సకాలంలో జీతాలు వేసేలా చూసుకుంది. ఎప్పటికప్పుడు జాబ్‌మేళాలు, ఉద్యోగాల డ్రైవ్ పెట్టి లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలను కల్పించింది.



ఒకే ఒక్కడు

ప్రైవేటు స్కూళ్ల ధాటికి రొట్టవలస పంచాయతీ అవతరాబాద్ ప్రాథమిక పాఠశాలలో ఒకే ఒక్క విద్యార్థి మిగిలాడు. ఈ ఒక్క విద్యార్థి కోసం టీచర్ పనిచేస్తుండడం గమనార్హం. వీరికి తోడుగా ఒక మరుగుదొడ్డి నిర్వాహక కార్మికురాలు కూడా ఉన్నారు.

– సరుబుజ్జిలి

కునుకుతూ మృతి చెందుతున్న కోళ్లు



కునుకు తీస్తున్న కోళ్లు

నరసన్నపేట: మండలం పోతయ్యవలసలో ఇళ్లలో పెంచుకొనే నాటు కోళ్లు గడిచిన రెండు రోజులుగా పెద్ద ఎత్తున మృతి చెందుతున్నాయి. కునుకు తీస్తూ కొన్ని గంటల్లోనే ప్రాణాలు కోల్పోతున్నాయి. దీంతో కోళ్ల పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. అదనపు ఆదాయం వస్తుందని కోళ్లు పెంచుకుంటుంటే ఇలా మృతి చెందడం వల్ల నష్టం కలుగుతోందని గ్రామస్తులు అంటున్నారు. రైతు కనపల అప్పలనాయుడు మాట్లాడుతూ కోళ్లు ఇలా మృతి చెందడం గతంలో ఎప్పుడూ జరగలేదని అన్నారు. ఇప్పటి వరకూ గ్రామంలో 200 పైగా కోళ్లు మృతి చెంది ఉంటాయని తెలిపారు.

క్లుప్తంగా

అక్కుపల్లి తీరంలో ఆకతాయిల హల్‌చల్



అప్రమత్తం చేస్తున్న ఎస్‌ఐ రామారావు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లి శివసాగర్ తీరంలో ఆదివారం కొంత మంది ఆకతాయిలు మద్యం సేవించి హల్‌చల్ చేశారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఒడిశా, పర్లాకిమిడి, టెక్కలిపట్నం, కాశీబుగ్గ, పలాసతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పర్యాటకులు తీరానికి వచ్చారు. పలాస, పర్లాకిమిడికి చెందిన నలుగురు యువకులు పూటుగా మద్యం సేవించి తీరంలో వెకిలి చేష్టలు చేస్తూ సముద్ర స్నానానికి దిగారు. మళ్లీ వెనక్కి రాలేకపోవడంతో మత్స్యకారులు వీరిని రక్షించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ సీహెచ్ రామారావు సిబ్బందితో కలిసి తీరానికి చేరుకొని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

పాలవలసలో పిచ్చికుక్క స్వైర విహారం



సోంపేట సామాజిక ఆస్పత్రిలో సంగారు దూదమ్మకు చికిత్స చేస్తున్న వైద్యులు

సోంపేట: మండలంలోని పాలవలస గ్రామంలో ఆదివారం ఉదయం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. గ్రామానికి చెందిన దున్న సోమితు, సంగారు దూదమ్మ, దుమ్ము ఓంకార్, టి.దనలక్ష్మి, డి.వెంకటరావు తదితరులతో పాటు ఒక ఆవును కరిచినట్లు గ్రామస్తులు తెలిపారు. సోంపేట సామాజిక ఆస్పత్రి, కొర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బాధితులు చికిత్స పొందారు.

ఉద్దానంలో సినిమా షూటింగ్



మండపల్లి ప్రాంతంలో హిల్ సినిమా షూటింగ్

ఇచ్ఛాపురం రూరల్: తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన మజ్జి పురుషోత్తం డైరెక్టర్, హీరోగా ఓ సినిమాను తెరకెక్కిస్తున్నారు. 'హిల్' పేరుతో రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ ఉద్దానం పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. ఈ చిత్రంలో ఉద్దానం ప్రాంతం కళాకారులు జయమ్మ పంచాయతీ ఫేమ్ బెందాళం రాజేష్ విలన్‌గా, హిమరిక రాకేష్, బల్లెడ శ్రీపతి, దినేష్ మజ్జిలు నటులుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని కిషోర్ యాజిక ఎడిటింగ్, అసిస్టెంట్ డైరెక్టర్‌గా ముకుందలు నిర్వహిస్తున్నారు.

హైస్కూళ్లలో సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలి



టెక్కలిలో సమావేశాన్ని నిర్వహించిన జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం ప్రతినిధులు

టెక్కలి: అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం జిల్లా అధ్యక్షుడు పుట్టా ఉదయ్‌కుమార్, రాష్ట్ర నాయకులు ప్రమోద్ కుమార్ పాడి వెల్లడించారు. ఆదివారం టెక్కలిలో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. జీవశాస్త్ర ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా శిక్షణ తరగతులను నిర్వహించాలని కోరారు. పాఠ్యాంశాల్లో మరింత విస్తృతమైన సమాచారాన్ని రూపొందించాలని పేర్కొన్నారు. స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరంను విస్తరింపజేయాలని వెల్లడించారు. ఈ సందర్భంగా టెక్కలి మండలానికి జ్యోతిష్ట బెహరా, నందిగాం మండలానికి లక్ష్మీపతి తదితరులు ఫోరం బాధ్యతలు చేపట్టాలని నిర్ణయించారు. కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు గగన కుమారి, వి.త్రివిక్రమ్, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్, ఫోరం ప్రతినిధులు టి.లోకేశ్వరరావు, కె.లక్ష్మీపతి, టి.అప్పలస్వామి, చల్లా రామారావు, జ్యోతష్టి బెహరా, పి.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

టెక్కలి రూరల్: మండలంలోని కిట్టాలపాడు గ్రామానికి చెందిన వివాహిత మోద నాగవేణి (44) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నాగవేణికి భర్తతో మనస్పర్థలు రావడంతో ఆమె మనస్తాపానికి గురై శనివారం తన ఇంటిలో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఇక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె కుమార్తె శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మంచం పట్టిన మెట్టవలస

- గ్రామంలో ప్రబలిన డయేరియా
- వైద్యం కోసం రాజాం ఆస్పత్రికి తరలింపు
- తాగునీరు కలుషితం కావడమే కారణం

జి.సిగడాం: మండలంలోని మెట్టవలస గ్రామం మంచం పట్టింది. ఊరిలో డయేరియా ప్రబలడంతో 30 మంది ఆస్పత్రి పాలయ్యారు. గ్రామంలో కిల్లారి స్రవంతి, డకర చైతన్య, పోలాకి శిరీష, బూరాడ పార్వతి, లాభాన దమయంతి, బెవర ప్రభాకరరావు, తాండ్రోతు చరణ్, పైల వినిత్ నాయుడు, డకర సాయితేజ, బూరాడ తవిటమ్మ లాభాన జాహ్నవి, లాభాన అప్పన్న, కిల్లారి నారాయణమ్మ లాభాన మౌళి, లాభాన రాజు, ఆభాన భానోజీ రావు, వడిపల్లి చిన్న, వడిపల్లి రమణమ్మ, గొర్లె ధర్మతేజ్, బెవర పల్లవి, మజ్జి మహేంద్రతోపాటు మరో 10 మంది వ్యాధితో బాధపడుతున్నారు. వీరికి స్థానిక వైద్యాధికారులు బుడుబూరు యశ్వంత్, పేకల సుమబిందు వైద్యసేవలు అందిస్తున్నారు.

రాజాం ఆస్పత్రికి తరలింపు

డయేరియాతో బాధపడుతున్న లాభాన దమయంతి, బెవర ప్రభాకరరావు, తాండ్రోతు చరణ్, లాభాన రాజు, కిల్లారి నారాయణమ్మలను రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వీరంతా చికిత్స పొందుతున్నారు. మిగతా వారికి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి రోగులకు



రాజాంలో చికిత్స పొందుతున్న రోగులు

వైద్య సేవలను అందిస్తున్నారు. గ్రామంలో అతిసార వ్యాధితో ప్రజలు బాధపడుతున్నారని తక్షణమే ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కా మొజుల అరుద్ర, ఎంపీటీసీ సభ్యురాలు మండల, జిల్లా ఉన్నతాధికారులకు ముందే ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదని వారు ఆవేదన చెందుతున్నారు.

గోప్యంగా ఉంచిన అధికారులు

గ్రామంలో 30 మందికి డయేరియా సోకినా మండల స్థాయి అధికారులు విషయాన్ని గోప్యంగా ఉంచడానికి ప్రయత్నించారు. మూడు రోజులుగా గ్రామస్తులు ఇబ్బంది పడుతుంటే మీడియాకు



కలుషితమైన నీరిస్తున్న బోరు

గానీ, జిల్లా ఉన్నతాధికారులకు గానీ ఎందుకు సమాచారం ఇవ్వలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. తాగునీరు కలుషితం కావడంతో వ్యాధి ప్రబలినట్లు భావిస్తున్నారు.

కేంద్ర మంత్రి దృష్టికి ఆర్‌జీయూకేటీ సమస్యలు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ఎస్ఎం పురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణలతో కూడిన బృందం కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఆదివారం శ్రీకాకుళంలో కలిసింది. క్యాంపస్‌లో ఎదుర్కొంటున్న సమస్యలు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఎస్ఎంపురం క్యాంపస్, చిలకపాలేం శివానీ అద్దె క్యాంపస్‌ల్లో రెండేళ్ల ప్రీ యూనివర్సిటీ కోర్సు, ఇంజినీరింగ్‌లో మొదటి రెండేళ్లు నాలుగు వేల మందికి క్లాస్‌వర్క్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంజినీరింగ్ మూడు, నాలుగేళ్లకు సంబంధించి రెండు వేల మందికి నూజివీడులో క్లాస్‌వర్క్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆరు వేల మందికి తగిన వసతి కల్పనకు కృషిచేయాలని కోరారు. సమస్యలు ముఖ్యమంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు మంత్రి



కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడికి ఆర్‌జేయూకేటీ పరిస్థితి వివరిస్తున్న డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏఓ రామకృష్ణ

వివరించారు. అనంతరం విద్యా ప్రమాణాలు, రిలీవ్ విద్యార్థులు ప్లేస్ మెంట్, అకడమిక్ కాలెండర్, కరిక్యులమ్ నిర్వహణ వంటి వాటిపై మంత్రికి డైరెక్టర్, ఏఓ వివరించారు.

ఉత్సాహంగా జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు



సాఫ్ట్‌బాల్ ఆడి ఎంపికలను లాంఛనంగా ప్రారంభిస్తున్న కలిదిండి వెంకటరామరాజు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి జూనియర్స్, సబ్‌జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఉత్సాహంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి రికార్డుస్థాయిలో 160 మందికిపైగా క్రీడాకారులు తరలివచ్చారు. ముఖ్య అతిథిగా జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు హాజరై మాట్లాడారు. ఈనెల 17 నుంచి జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జయకేతనం ఎగురవేసి జిల్లాకు గౌరవాన్ని, కీర్తిప్రతిష్ఠతలను నిలబెట్టాలని కోరారు. అలాగే జిల్లాలో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్-2024 పోటీలను విజయవంతం చేయాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి పిలుపునిచ్చారు. జిల్లా జట్లకు ఎంపికయ్యే క్రీడాకారులకు ఈనెల 7 నుంచి 16వ తేదీవరకు శిక్షణ శిబిరాలను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి మొజ్జాడ వెంకటరమణ తెలిపారు. కేశవరావుపేట జెడ్పీహెచ్‌స్కూల్‌లో బాలురుకు, ఇప్పిలి జెడ్పీహెచ్‌స్కూల్‌లో బాలికలకు శిక్షణ శిబిరాలను ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

కేఆర్ స్టేడియం పనులు మొదలు

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణ పనులు మొదలయ్యాయి. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రత్యేక చొరవ తీసుకుని పనులు మొదలయ్యేలా చర్యలు చేపట్టారు. స్టేడియంలో నిర్మితమవుతున్న భవనానికి మూడో ఫ్లోర్ పనులకు పరంజీలును ఏర్పాటుచేశారు. మైదానంలోని మట్టి దిబ్బలను జేసీబీ, ట్రాక్టర్లతో చదును చేయిస్తున్నారు.



మట్టి దిబ్బలను చదును చేస్తున్న జేసీబీ, ట్రాక్టర్లు

స్నేహితుల దినోత్సవం వేళ విషాదం



అచేతనంగా పడి ఉన్న నిరంజన్

తగరపువలస : స్నేహితుల దినోత్సవం వేళ విషాదం నెలకొంది. సరదాగా గడిపేందుకు వెళ్లిన స్నేహితుల్లో ఒకరు కాలు జారి గంభీరం రిజర్వాయర్‌లో పడిపోవడంతో మునిగిపోయి మృతిచెందాడు. ఈ దుర్ఘటన ఆనందపురం మండలం గంభీరం రిజర్వాయర్ వద్ద జరిగింది. గీతం విద్యార్థి డోకి నిరంజన్ కాలు జారి పడిపోవడంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా నిరంజన్‌తోపాటు మరో నలుగురు విద్యార్థులు ఆశిష్, రిహాన్, లలిత్, మోహిత్ సరదాగా గడపడానికి రిజర్వాయర్ వద్దకు చేరుకున్నారు. రిజర్వాయర్ మధ్యలో గట్టుపై నడుస్తుండగా నిరంజన్‌తోపాటు ఆశిష్, రిహాన్ కాలు జారి పడిపోయారు. ఆ సమయంలో అక్కడే ఉన్న స్థానికులతోపాటు మిగిలిన స్నేహితులు ఆశిష్, రిహాన్‌ను రక్షించగా నిరంజన్ మునిగిపోవడంతో మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఆశిష్‌కు గాయాలు కాగా ఆనందపురం పోలీసులు స్థానిక పీహెచ్‌సీకీ తరలించి చికిత్స చేయిస్తున్నారు. వీరంతా గీతం కళాశాలలో బీటెక్ సీఈసీ మూడో సంవత్సరం చదువుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని స్వస్థలం శ్రీకాకుళం జిల్లా పలాస. అతని తండ్రి దుస్తుల వ్యాపారం నిర్వహిస్తుంటాడు. నిరంజన్ మృతి విషయం తెలుసుకున్న స్నేహితులు గంభీరం రిజర్వాయర్ వద్దకు, ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. సీఐ టీవీ తిరుపతిరావు మృతుని కుటుంబ సభ్యులకు వివరాలు తెలియజేసి కేసు నమోదుచేశారు.

బైక్ అదుపు తప్పి సచివాలయ ఉద్యోగి మృతి

శృంగవరపుకోట: ఎస్.కోట మేజర్‌పంచాయతీ సచివాలయం-1లో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కర్రి సాగర్ (35) శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శ్రీకాకుళానికి చెందిన సాగర్ మూడేళ్లుగా ఎస్.కోట సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని శ్రీకాకుళంలో ఉన్న తన తల్లిని చూసేందుకు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. లావేరు మండలంలోని సుభద్రాపురం వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు.

'బోధన'మున పనులు

- విద్యాబోధనలో సరికొత్త సాంకేతికతను జతచేస్తున్న డీహెచ్ సుబ్రహ్మణ్యం
- జి.సిగడాం ఏపీ మోడల్‌స్కూల్‌లో పీజీటీగా విధుల నిర్వహణ
- ఏఆర్ టెక్నాలజీ సహాయంతో విద్యార్థులకు పాఠాల బోధన

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆయన ఇంగ్లిష్ చెబితే కుర్చీలకు అతుక్కుపోయి మరీ వింటామని విద్యార్థులు చెబుతుంటారు. ఏఆర్ టెక్నాలజీని వాడుకుంటూ ఆయన చెప్పే పద్ధతికి ఫిదా కాని వారంటూ ఉండరని అంటుంటారు. జి.సిగడాం మోడల్ స్కూల్ కాలేజీలో ఇంగ్లిష్ పీజీటీ అధ్యాపకుడిగా పనిచేస్తున్న దసిక హోర సుబ్రహ్మణ్యం బోధనలో సరికొత్త ఒరవడికి నాంది పలుకుతున్నారు. జిల్లాలోనేకాదు ఉత్తరాంధ్రలోనే ఏఆర్ టెక్నాలజీ సాయంతో బోధన చేసిన అధ్యాపకునిగా గుర్తింపు అందుకున్నారు. దాన్ని మలేషియా టెక్నాలజీ సాయంతో బోధన ఉపకరణం ఉపయోగిస్తున్నారు.

బోధనకు సాంకేతికతను జతచేసి..

2006లో డీఎస్సీ ద్వారా ఎస్‌జీటీగా ఎంపికైన డీహెచ్ సుబ్రహ్మణ్యం విశాఖపట్నంలో పనిచేశారు. అనంతరం 2012లో స్టేట్ సెలెక్షన్ కమిటీ ద్వారా ఇంగ్లిష్ పీజీటీగా ఓపెన్ కేటగిరిలో ఎంపికయ్యారు. మొదటి పోస్టింగ్ అనకాపల్లిలోని పాటిపల్లి ఏపీమోడల్ స్కూల్‌లో పదేళ్లు పనిచేసి 2022లో శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం మోడల్ స్కూల్‌కు బదిలీపై వచ్చారు. బోధనలో ఆది నుంచి సాంకేతికతను జత చేయడం ఆయనకు అలవాటు. కోవిడ్ కాలంలోనూ ఆన్‌లైన్ క్లాసులు చెప్పి భేష్ అనిపించారు. 2022 సెప్టెంబర్‌లో బెంగళూరులో జరిగిన అంతర్జాతీయ స్థాయి ఐడీఏ వర్క్‌షాప్‌కు ఎంపికై ఫిన్‌లాండ్, గ్రేట్ బ్రిటీష్ ఎడ్యుకేషన్ సదస్సులో పాల్గొనడమే కాక



నిజమైన పులికాదు. ఏఆర్ టెక్నాలజీ సాయంతో బోధన చేస్తున్న సుబ్రహ్మణ్యం

అద్భుతమైన ప్రసంగంతో ఆకట్టుకున్నారు. అలాగే 2023 జనవరిలో యునిసెఫ్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్(టిఐఎస్ఎస్)వారు సంయుక్తంగా నిర్వహించిన సీటీఎల్‌టీ ఆంగ్లభాష శిక్షణ కార్యక్రమంలో తనదైన రీతిలో ప్రతిభ కనబర్చి పీడీ ప్లాన్స్ నిర్వహించి మాస్టర్ ట్రైనర్‌గా ఎంపికయ్యారు. మూడు నెలలపాటు ఆన్‌లైన్‌లో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ 2023 సెప్టెంబర్ 5వ తేదీన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసి సత్కరించింది కూడా.

ప్రోత్సాహం మరువలేనిది



విద్యార్థుల మానసిక సామర్థ్యాల ఆధారంగా తరగతి గది బోధనను సాగిస్తూ అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందిస్తే మంచి ఫలితాలు వస్తాయి. జిల్లాతోపాటు ఉత్తరాంధ్రలోనే ఇంత వరకు పరిచయం చేయని విధంగా ఏఆర్ టెక్నాలజీ సాయంతో పాఠాల బోధనను చేపట్టడం జరిగింది. ఇలాంటి సాంకేతికత, సామాజిక, సేవా కార్యక్రమాల నిర్వహణకు డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ, ప్రిన్సిపాల్, సహచర సిబ్బంది ప్రోత్సాహం, సహకారం మరువలేనిది. అందరికీ కృతజ్ఞతలు.

– డీహెచ్ సుబ్రహ్మణ్యం, ఇంగ్లిష్ పీజీటీ అధ్యాపకుడు, ఏపీమోడల్‌స్కూల్, జి.సిగడాం

మళ్లీ ఇన్నాళ్లకు..



తొగరాం కాలేజీలో 1996–98లో ఇంటర్ చదివిన వారు ఆర్‌సీఎం కళాశాల ప్రాంగణంలో ఆదివారం మళ్లీ కలిశారు. 27 ఏళ్ల కిందటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అప్పటి కాలేజ్ చైర్మన్ రొణంకి జనార్దన్, పూజారి దామోదర్, హరిప్రసాద్, నక్క గురునాథ్, కొండలరావు, రాఘవాచార్యులు, సంతోషికుమారి, సుజాత తదితరులు హాజరయ్యారు. – శ్రీకాకుళం కల్చరల్

మళ్లీ మళ్లీ ఇది రాని రోజు



హిరమండలం ప్రభుత్వ కాలేజీలో 1983–93 మధ్య కాలంలో చదివిన వారంతా ఆదివారం శ్రీకాకుళంలో మళ్లీ కలిశారు. ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు చెప్పుకున్నారు. – కొత్తూరు

అలరించిన మహాధారణ అవధానం

శ్రీకాకుళం కల్చరల్: ఉపనిషన్మందిరం అధ్యక్షులు గుమ్మా నగేష్, కార్యవర్గం నిర్వహణలో కోదండ రామాలయంలో విశాఖకు చెందిన ఓరుగంటి రాజరాజేశ్వరి ప్రసాద్ 'మహాధారణావధానం' కార్యక్రమం ఆదివారం చక్కగా సాగింది. పోతన భాగవతంలోని దశమస్కంధం, పూర్వ భాగంలో ఉన్న 1800 పద్య, గద్యాల్లో పలువురు ప్రాశ్నికులు మొదటి పదం ఇవ్వగా మిగిలిన పద్య, గద్యాన్ని అవధాని చక్కగా పూరణ చేసి సభను ఆకట్టుకున్నారు. నిష్టల నర్సింహమూర్తి సంధాన కర్తగా వ్యవహరించగా, ప్రత్యేక ఆహ్వానితులుగా విజయనగరానికి చెందిన ఆర్.రామసుబ్బారావు, పి.రాజేశ్వరరావులు పాల్గొనగా పృచ్ఛకులుగా పి.శ్రీనివాసరావు, బి.కోమలరావు, ఎం.మోహన్‌రావు, పీవీఎస్ సాయి ప్రసాద్, పి.హరనాథరావు, ఎం.నరసింగరావు, జె.శరత్‌బాబు, ఆర్.ప్రసాదరావు వ్యవహరించారు. ధారణ కర్తను, పృచ్ఛకులను మందిరం ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో ఎస్.మోహనరావు, ఎస్.అప్పన్న, బి.మల్లేశ్వరరావు, డాక్టర్ ఈఎస్ సంపత్‌కుమార్, బీఏ మోహనరావు, గౌరీశంకర్, పి.ఈశ్వరరరావు, మహోహర్, కె.ఉమ, సరస్వతి పాల్గొన్నారు.



మహాధారణావధానం నిర్వహిస్తున్న దృశ్యం

సీఐలకు స్థాన చలనం

శ్రీకాకుళం క్రైమ్ : విశాఖపట్నం రేంజి పరిధిలో 35 మంది సీఐలకు స్థానచలనం చేస్తున్నట్లు డీఐజీ కార్యాలయం నుంచి శనివారం అర్ధరాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు జిల్లా నుంచి పది మందికి స్థానచలనం జరగ్గా.. వీరిలో సీఐలు అవతారం, సూరినాయుడు, ఇమ్మాన్యుయెల్ రాజులకే పోస్టింగ్ దక్కింది. మిగతా ఏడుగురిని వీఆర్‌కు పంపించడం గమనార్హం. జిల్లాకు ఎనిమిది మంది బదిలీపై రానున్నారు.

సీఐ	ప్రస్తుత స్థానం	బదిలీపై వెళ్లనున్న స్థానం
మట్టాల అవతారం	ట్రాఫిక్ (శ్రీకాకుళం)	జె.ఆర్.పురం(శ్రీకాకుళం)
జి.రామచంద్రరావు	జె.ఆర్.పురం(శ్రీకాకుళం)	వీఆర్ (విశాఖ రేంజి)
సిహెచ్ సూరినాయుడు	టాస్క్‌ఫోర్స్ (శ్రీకాకుళం)	విజయనగరం ట్రాఫిక్
చింతాడ ప్రసాద్	వీఆర్ (విశాఖ రేంజి)	కొత్తూరు (శ్రీకాకుళం)
ఆర్.వేణుగోపాల్	కొత్తూరు (శ్రీకాకుళం)	వీఆర్ (విశాఖ రేంజి)
బోరపు మంగరాజు	చినమేరంగి(మన్యం)	సోంపేట (శ్రీకాకుళం)
హెచ్ మల్లేశ్వరరావ	సోంపేట (శ్రీకాకుళం)	వీఆర్ (విశాఖ రేంజి)
జె.శ్రీనివాసరావు	సీఐడీ విభాగం	నరసన్నపేట(శ్రీకాకుళం)
బూర ప్రసాదరావు	నరసన్నపేట(శ్రీకాకుళం)	వీఆర్ (విశాఖ రేంజి)
కునుకు శ్రీనివాసరావు	ఇంటెలిజెన్సు విభాగం	టెక్కలిరూరల్(శ్రీకాకుళం)
ఎస్ఎస్ చంద్రమౌళి	టెక్కలిరూరల్(శ్రీకాకుళం)	వీఆర్ (విశాఖ రేంజి)
మీసాల చిన్నంనాయుడు	ఏసీబీ విభాగం	ఇచ్ఛాపురం(శ్రీకాకుళం)
టి.ఇమ్మాన్యుయెల్‌రాజు	ఇచ్ఛాపురం(శ్రీకాకుళం)	స్పెషల్‌బ్రాంచి(శ్రీకాకుళం)
ఆర్.సత్యనారాయణరెడ్డి	స్పెషల్‌బ్రాంచి(శ్రీకాకుళం)	వీఆర్ (విశాఖ రేంజి)
కె.పైడపునాయుడు	సీఐడీ విభాగం	శ్రీకాకుళం రూరల్ పీఎస్
లెంక సన్యాసినాయుడు	శ్రీకాకుళం రూరల్ పీఎస్	వీఆర్ (విశాఖ రేంజి)

'రెల్లి కులస్తులకు న్యాయం చేయాలి'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఉత్తరాంధ్రలో రెల్లి, రెల్లి ఉపకులాలు ఎక్కువగా ఉన్నాయని, 5 శాతం రెల్లి కులాలకు రిజర్వేషన్ కల్పించాలని రెల్లికుల సంక్షేమ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు గండి విజయ్‌కుమార్ కోరారు. శ్రీకాకుళం నగరంలో ఆర్ట్స్‌కళాశాల గ్రౌండ్‌లో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి మోహనరావు మాట్లాడుతూ గతంలో రెల్లి కులాలకు తీవ్ర అన్యాయం జరిగిందని మళ్లీ పునరావృతం కాకుండా చూడాలన్నారు. రెల్లి కులస్తులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రెల్లికుల ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు డాక్టర్ ఎ.మోహన్‌రాజు, సిరిపురుపు ప్రసాద్, గోవిందరావు, శ్రీను, ఆర్జి ఈశ్వరరావు, యుగంధర్, మురళి, అప్పన్న, గొల్లిపల్లి సురేష్, రాయిపల్లి సుదర్శన్, సిరిపల్లి ఈశ్వరరావు, గొల్లపల్లి భాశంకరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఐక్యతను చాటుతున్న రెల్లి కులస్తులు